ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
సోమవారం 15 జనవరి 2024

ఐలోని మల్లన్నకు దండాలో..


ఐనవోలు మల్లికార్జునస్వామి దర్శనానికి క్యూలైన్ నుంచి వస్తున్న భక్తులు

వీరభద్రా.. శరభ.. శరభ..


కొత్తకొండలో శ్రీవీరభద్రస్వామి దర్శనానికి వస్తున్న భక్తులు

జాతరో.. జాతర

భక్తులతో పోటెత్తిన ఐనవోలు, కొత్తకొండ, మేడారం జాతరలు

భోగి పండుగ రోజు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జాతరల్లో భక్తులు పోటెత్తారు. హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర, కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి జాతరలు ప్రారంభం కాగా, ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. క్యూలైన్లలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఐనవోలులో శివసత్తులు భక్తిపార్యవశ్యంతో ఊగిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. నేడు బండ్లు తిరిగే కార్యక్రమం ఉంది. అలాగే కొత్తకొండలో భక్తులు గుమ్మడి కాయ మొక్కును తీర్చుకున్నారు. సోమవారం ఇక్కడ ప్రభ బండ్లు తిరగనున్నాయి. జాతరలకు పలువురు ప్రముఖులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఇక ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం జాతరకు ముందస్తుగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఫిబ్రవరిలో జరగనున్న జాతరకు ఇప్పటికే భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో గద్దెల ప్రాంగణం సందడిగా మారింది.

7

- ఐనవోలు / భీమదేవరపల్లి / మేడారం

మేడారం సమ్మక్క - సారక్కకు జై..


మేడారం సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణంలో భక్తుల సందడి

నేడే సంక్రాంతి

- సిరి సంపదలతో జరుపుకొనే పండుగ
- వేడుకలకు సిద్ధమైన పల్లెలు, పట్టణాలు
- ముగ్గులతో అలరిస్తున్న లోగిళ్లు
- జాతరలకు పోటెత్తిన భక్తజనం
- ఘనంగా గోదాదేవి కల్యాణాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 14: మార్గశిర మాసం మకర సంక్రమణం రుతువు మారే గడియవేళలో మకర సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు సోమవారం నిర్వహించుకోనున్నారు. మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో మొదటి రోజు ఆదివారం భోగి పండుగను వైభవంగా జరుపుకోగా నేడు సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సంక్రాంతి పర్వదినం రోజున రైతులు పంట చేతికొచ్చాక సిరి సంపదల ధాన్యలక్ష్మి ఇంట్లో ఉండడంతో నూతన వస్త్రాలతో సంబురాలతో సిరి సంపదలతో తులతూగాలని, ఆయురారోగ్యాలతో కలగాలని కోరుకుంటూ సంక్రాంతి పర్వదినాన్ని ఆచరించుకుంటారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల వేడుకల్లో ప్రధానంగా ఈ పండుగ రోజున సూర్య భగవానుడు సంక్రమణం చెబుతాడని చలి రుతువు మారి వేసవి రుతువు ప్రారంభం అవుతుంది. దీనిని మకర సంక్రాంతి పర్వదినం రోజున మార్పుగా గుర్తిస్తూ సంక్రాంతి పండుగ రోజున సాయంత్రం వేళ అయ్యప్ప స్వామి శబరిమలైలో జ్యోతి స్వరూపంలో దర్శనమిస్తారని ఈ పర్వదినాన్ని అతి ముఖ్యంగా ఆచరిస్తారు.

ముంగిళ్ల ముందు ముగ్గుల హరివిల్లు..

భోగి పండుగ ఆదివారం రోజు ఇళ్ల ముంగిళ్ల ముందు మహిళలు హరివిల్లులు, రంగురంగుల ముగ్గులతో సంక్రాంతి పర్వదినాన్ని సంస్కృతి సంప్రదాయాన్ని తెలియజెప్పే ముగ్గులను వేశారు. పొంగలి, సూర్యదర్శనం, చెరుకు గడలు, జోడెద్దులు, ధాన్యం ఎడ్ల బండిలో ఇంటికి రకరకాల పక్షుల కిలకిలలతో కూడిన ముగ్గులను సంక్రాంతి ముగ్గులుగా ఇళ్లముందు శోభాయమానంగా వేస్తారు. సంక్రాంతి పర్వదినం సోమవారం కూడా ప్రతీ ఇంటి ముందు రంగురంగుల పెద్ద పెద్ద ముగ్గులను గొబ్బెమ్మలను పెట్టిసంక్రాంతి విశిష్టతను ఆచరిస్తారు.

ఘనంగా గోదాదేవి కల్యాణాలు..

నెల రోజులపాటు తిరుప్పావై ప్రవచనాలు ఉదయం, సాయంత్రం పూజలతో కొనసాగిన ధనుర్మాసం ముగింపు అనంతరం ఆదివారం జిల్లా వ్యాప్తంగా నగరంలోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి కల్యాణాలు కన్నుల పండువగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు ఈ కల్యాణోత్సవానికి తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, గీతా భవన్ శ్రీవేంకటేశ్వర స్వామి, కొత్తగుడిలోని శ్రీసీతారామచంద్రస్వామి, గోవిందరాజుల గుట్టపై గోవిందరాజుల స్వామి ఆలయంతో పాటు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణాలు వైభవంగా జరిగాయి.


వరంగల్ పోస్టాఫీస్ వద్ద పూల విక్రయాలు

జాతరలకు పోటెత్తిన భక్తజనం..

సంక్రాంతి పండుగ వచ్చిందంటే జాతరల సందడి ఉంటుంది. ముఖ్యంగా ఐనవోలు మల్లన్న, కొమురవెల్లి మల్లన్న, కొత్తకొండ వీరభద్రన్న జాతరల జోరు సాగుతుంది. ఈ జాతరలకు జిల్లా నుంచి ప్రజలు భోగి పండుగ రోజున, సంక్రాంతి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లి దర్శనం చేసుకుంటారు. తమ ఇళ్ల వద్ద బోనాలను చేసి నైవేద్యంగా పెట్టి జాతరలో కూడా బోనాలు చేసి పట్నాలు వేస్తారు. ఉపవాసాలు చేస్తారు. తిరున్నాళ్ల సందడి రమణీయంగా కొనసాగుతుంది.

చిన్నారుల హోరు పతంగుల జోరు..

సంక్రాంతి సంబరాల్లో పతంగులు, గాలిపటాల సందడి ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు వయసుతో తారతమ్యం లేకుండా గాలిపటాలను ఎగరవేయడం ఆచారంగా వస్తోంది. రంగురంగుల గాలిపటాలు దారాలు, మాంజలతో గాలిపటాలను ఎగరవేసి పోటీలు నిర్వహిస్తారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి : మంత్రి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 14: ప్రజలు సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలని, రైతులు పంట అధిక దిగుబడి సాధించి లాభాలు పొందాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలిపేలా రంగురంగుల హరివిల్లు ముగ్గును మంత్రి హనుమకొండలోని తమ స్వగృహం ముందు వేసి పండుగ ప్రాముఖ్యతను చాటారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో మొదలైన ప్రజా పాలనలో స్వేచ్ఛ సౌభాగ్యాలతో ప్రజలు సంతోషంగా పండుగ సంబరాలు జరుపుకోవాలని తెలిపారు.

చిట్టీలతో పేరుతో మోసం

బీఆర్ఎస్ కార్పొరేటర్ అరెస్ట్, రిమాండ్

మట్టెవాడ, జనవరి 14: చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన 26వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ బాలిన సురేశ్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ ఎల్.పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. సీఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం.. కమిట్‌మెంట్ చిట్టీల పేరుతో కార్పొరేటర్ సురేశ్ వరంగల్ ప్రాంతంలోని వంద మంది సభ్యులతో నెలవారి చిట్టీలను ప్రారంభించారు. సుమారు రూ.లక్ష నుంచి రూ.5లక్షలు ఆపై వరకు వివిధ పద్ధతుల్లో చిట్టీలను నిర్వహిస్తున్నారు. దీంతో సభ్యులో వేలల్లో డబ్బులు జమచేశారు. కానీ, చిట్టీ పాడినవారిని, చిట్టీ ఐపోయిన వారికి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో విసిగివేశారు. బాధితులు జి.శ్రావణ్‌కుమార్, తైలం గౌతమ్‌సాగర్‌లు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఆదివారం సురేశ్‌ను అరెస్ట్ చేసి రూ.1.15 కోట్లు స్వాధీన పర్చుకుని, రిమాండ్‌కు తరలించారు.


ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో

పండుగ పూట విషాదం

- మహబూబాబాద్ జిల్లాలో ఆటోను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే నలుగురి మృతి
- పలువురికి తీవ్రగాయాలు

మహబూబాబాద్, జనవరి 14(ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో భోగి పండుగ నాడు విషాదం చోటు చేసుకుంది. ఆదివారం జిల్లాలోని కంబాలపల్లి శివారు అటవీశాఖ అర్బన్ పార్కు సమీపంలో గూడూరువైపు వెళ్తున్న ఆటోను మహబూబాబాద్‌కు వస్తున్న కారు ఎదురుగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ ఇస్లావత్ శ్రీను(35)తో పాటు ఆయన తల్లి పాప(60), కుమారుడు రిత్విక్(4), కుమార్తె రిత్విక(2) అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీను అత్త మాలోతు శాంతి, బావమరిది సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. గూడూరు మండలం చిన్న ఎల్లాపురం ఆమూ తండాకు చెందిన ఆటో డ్రైవర్ ఇస్లావత్ శ్రీను భార్య

మిగతా 8వ పేజీలో..


మృతురాలు పాప (ఫైల్)


మృతులు శ్రీను, రిత్విక్, రిత్విక (ఫైల్)



ప్రథమ బహుమతి గెలుచుకున్న అశోక్‌నగర్ (నర్సంపేట) జట్టు

కబడ్డీ విజేత అశోక్‌నగర్ జట్టు

పాలకుర్తిలో ముగిసిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి పోటీలు

పాలకుర్తి, జనవరి 14: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం అశోక్‌నగర్ జట్టు ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఆ జట్టుకు మెమొంటోతో పాటు రూ.20 వేల నగదు అందించారు. అదేవిధంగా ద్వితీయ బహుమతి పాలకుర్తి మండలం ఈరవెన్ను జట్టు గెలుచుకోగా రూ.15వేలు, తృతీయ బహుమతి రఘునాథపల్లి మండలం మచ్చుపహాడ్ జట్టు గెలుచుకోగా రూ.10 వేలు, నాలుగో బహుమతి పాలకుర్తి యువ చైతన్య యూత్ జట్టుకు రూ.8వేలు, ఐదో బహుమతి ధర్మసాగర్ మండలం పీచర జట్టుకు రూ.6వేలు, ఆరో బహుమతి రఘునాథపల్లి మండలం నిడిగొండ జట్టుకు రూ.4 వేలు నగదు అందించారు.

జనగామ జిల్లా పాలకుర్తిలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మొత్తం 110 జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథులుగా మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్, హైదరాబాద్‌కు చెందిన ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ అంజపల్లి నాగమల్లు, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచెర్ల భిక్షపతి, పాలకుర్తి, దేవరుప్పల ఎస్సైలు లింగారెడ్డి శ్రావన్‌కుమార్ హాజరై విజేత జట్లకు బహుమతులు అందచేశారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాసరావు, సర్పంచు యాకాంతరావు, వర్రె వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, దేవగిరి రామన్న, డీ.వీ.ఆర్ శర్మ, ఎంపీటీసీ కమ్మగాని పుష్పలీల, నాగయ్య, ఉప సర్పంచు తరాల చంద్రబాబు, పెనుగొండ రమేష్, పీఈటీలు సోమల్లు, శ్రీనివాస్, అశోక్, మహేష్, యాదగిరి, యువ చైతన్య యూత్ బాధ్యులు ఎడవెల్లి సోమేశ్వర్, చిట్యాల రఘు, ఎలమకంటి సందీప్, కమ్మగాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ధర్మసాగర్, జనవరి 14: కాజీపేట మండలం రాంపూర్ ఇండస్ట్రియల్‌లో గంజాయిని ఆదివారం పోలీసులు పట్టుకున్నట్టు సీఐ శ్రీధర్‌రావు తెలిపారు. బిహార్ రాష్ట్రంలోని సింగేశ్వర్ గ్రామంలోని మాదేపురం జిల్లాకు చెందిన చోటు కుమార్ ప్రస్తుతం హైదరాబాద్ కాటేదాన్‌లో క్యాటరింగ్ బాయ్‌గా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి విశాఖపట్నం నుంచి కాజీపేట మీదుగా రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాకు వచ్చి గంజాయిని అమ్ముతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాంపూర్ ఇండస్ట్రియల్‌లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నిందితుడు చోటు కుమార్ రెండు బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు చోటు కుమార్‌వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా బ్యాగ్‌లో గంజాయి కనిపించడంతో పోలీసులు చోటు కుమార్‌ను అదుపులోకి తీకున్నారు. అతడి వద్ద ఉన్న రూ.ఐదు లక్షల 22,500 విలువ గల 20.9కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కాగా, ఈ కేసులో నిందితుడికి సహకరించి మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

రైస్‌మిల్ ట్యాంక్‌లో పడి కూలి మృతి



మృతి చెందిన బుద్ధన్‌కుమార్

ధర్మసాగర్, జనవరి 14: హనుమకొండ జిల్లా రాంపూర్ బాయిల్డ్ రైస్‌మిల్ ట్యాం క్‌లో పడి బిహార్‌లోని హరినిత్‌కు చెందిన బుద్దన్‌కుమార్ (21) అనే కూలి మృతి చెందినట్టు సీఐ శ్రీధర్‌రావు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌లోని హరినిత్‌కు చెందిన కొంత మంది కూలీలు హ మాలీ పనిచేసేందుకు రెండు నెలల కింద ట మారుతి అగ్రోస్ బాయిల్డ్ రైస్ మిల్ ఇండస్ట్రీయల్‌లో పనిచేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పది గంటల ప్రాంతంలో హమాలీ పనులు చేస్తుండగా బియ్యం ట్యాంక్‌లో నుంచి బాయిల్డ్ రైస్ కిందికిరాకపోవడంతో, ట్యాంక్‌లో ఏదో తట్టిందని పరిశీలించినా ఏమి కనిపించక పోవడంతో బుద్ధ కుమార్ బియ్యం ట్యాంక్ లోపలికి దిగాడు. ట్యాంక్ చుట్టూ ఆగిన బియ్యాన్ని చేతుల సాయంతో తొలగిస్తుండగా పైన ఆగి ఉన్న బియ్యం ఒక్కసారిగా బుద్ధ కుమార్‌పై పడడంతో శ్వాస ఆడక మృతి చెం దాడు. బియ్యం ట్యాంక్ లోపలికి వెళ్లిన బుద్ధ కుమార్ ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో సమీపంలో ఉన్న వారు పైకి వెళ్లి చూడగా బుద్ధకుమా ర్ మృతి చెంది కనిపించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హసన్‌పర్తి- ఉప్పల్ మధ్య

రవాణా మరింత మెరుగు

- పూర్తయిన మూడో లైన్, విద్యుదీకరణ పనులు
- అందుబాటులోకి వచ్చిన కొత్త రైలు మార్గం



పనులు పూర్తయిన హసన్‌పర్తి రోడ్-ఉప్పల్ రైలు మార్గం

హనుమకొండ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): కాజీపేట- బల్లార్షా విద్యుదీకరణ ప్రాజెక్టులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే హసన్‌పర్తి రోడ్డు- ఉప్పల్ మధ్య 12.7 కి.మీ. మేర విద్యుదీకరణతో పాటు మూడోలైన్ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గం ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. కూడా. కాజీపేట- బల్లార్షా మధ్య ఉన్న సెక్షన్‌గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉత్తర ప్రాంతాలను దేశంలోని దక్షిణ ప్రాంతంతో కలుపే కీలకమైన రైలు మార్గం ఇది. దీంతో ఈ ప్రాజెక్టు కింద ఇది వరకు చేపట్టిన పనులు కలుపుకొని ఇప్పుడు మొత్తం 131.7 కి.మీ. మేర పూర్తయింది. గతంలో పూర్తయిన రాఘవపురం - మందమర్రి సెక్షన్‌తో కలిపి కాజీపేట - బల్లార్షా సెక్షన్‌లో మొత్తం 164 కి.మీ. మేర విద్యుదీకరణ సౌకర్యంతో పాటు మూడో లైన్ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 159 కి.మీ. పరిధిలో పనులు జరుగుతున్నాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో 12.7 కి.మీ. మేర హసన్‌పర్తి - ఉప్పల్ మధ్య ఈ మూడోలైన్ పనులు పూర్తయ్యాయి. దీనివల్ల ఈ ప్రాంత సామాజిక- ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుంది. మూడో లైన్ ప్రారంభించడం వల్ల ఈ గ్రాండ్‌ట్రంక్ రూట్‌లో సరుకు రవాణా, ప్యాసింజర్ రైళ్ల రద్దీ మరింత తగ్గుతుంది. మిగిలిన ప్రాంతంలో కూడా పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ మాట్లాడుతూ.. హసన్‌పర్తి-ఉప్పల్ మధ్య ట్రిప్లింగ్, విద్యుదీకరణ పనులను పూర్తి చేసిన సికింద్రాబాద్ డివిజన్, నిర్మాణ సంస్థ సిబ్బందిని అభినందించారు. కాజీపేట-బల్లార్ష ట్రిప్లింగ్ ప్రాజెక్టు పూర్తి చేయడం వల్ల ఈ మార్గంలో రద్దీ తగ్గుతుందని, సరుకు రవాణా, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

రూ. 2063 కోట్లతో..

కాజీపేట-బల్లార్షా సెక్షన్‌లో మిగిలిన భాగంలో ట్రాఫిక్, ట్రిప్లింగ్, విద్యుదీకరణ పనులను మరింత వేగవంతం చేయడానికి 2015-16 సంవత్సరంలో 202 కి.మీ (తెలంగాణ-159 కి.మీ, మహారాష్ట్ర-43 కి.మీ) దూరం రూ.2,063కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేశారు. ఇందులో భాగంగా ఉప్పల్ -రాఘవాపూర్ మధ్య 59 కి.మీ, సిర్పూర్ ఖాగజ్ నగర్-మాణిక్‌ఘర్ మధ్య 60 కి.మీ మేర పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. గ్రాండ్‌ట్రంక్ రూట్‌లో ఉన్న ఈ మెయిన్‌లైన్ ప్యాసింజర్, సరుకు రవాణా రెండింటిలో నిరంతర వృద్ధిని సాధిస్తోంది.

శాఖల మధ్య పోరు.. భక్తుల బేజారు..

● నిలిచిపోయిన కొండాయి - మేడారం బీటీ రోడ్డు పనులు ● 2016లో రూ.29కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ ప్రణాళికలు ● అడవిలో నిర్మాణంపై కోర్టును ఆశ్రయించిన అటవీశాఖ ● ప్రతీ జాతరకు ఇబ్బంది పడుతున్న భక్త జనం

మేడారం, జనవరి 14: ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం కొండాయి నుంచి మేడారం రావడానికి ఊరట్టం వరకు బీటీరోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. మరికొన్ని రోజుల్లో మహా జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులకు తిప్పలు తప్పేలా లేవు. జాతరకు మూడు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఈసారి కూడా అవస్థలు పడాల్సిందే.

రూ.29 కోట్లతో...

కొండాయి-మేడారం రోడ్డు నిర్మాణానికి 2016లో రూ.29కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. అదే ఏడాది రోడ్లు, భవనాల శాఖ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. మేడారం మహా జాతరకు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్ర నుంచి భక్తులు రావడానికి ఈ రోడ్డును నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భక్తులకు దూరభారం తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టారు. అయితే.. ఈ నిర్మాణాన్ని అటవీ శాఖ అడ్డుకుంది. ఈ క్రమంలోనే 2018 జాతరలో అప్పటి భూపాలపల్లి కలెక్టర్ ఆకునూరి మురళి జోక్యం చేసుకుంటూ ఈ రహదారిని నిర్మిస్తే కొండాయి, మల్యాల, కొత్తూరు, ఐలాపూర్ తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని భావించారు. రోడ్డు నిర్మాణానికి ఫారెస్టు అధికారులు అనుమతి ఇవ్వని నేపథ్యంలో ఈ మట్టిరోడ్డుపై కనీసం కల్వర్టులైనా కట్టినిస్తే కొంతైనా సౌలభ్యం ఉంటుందనుకున్నారు. ఈ క్రమంలో రూ. 2.5కోట్ల వ్యయంతో కల్వర్టుల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే.. కల్వర్టుల నిర్మాణం పేరుతో వన సంపదను ధ్వంసం చేశారంటూ ఫారెస్టు అధికారులు రోడ్లు, భవనాల శాఖపై కేసు పెట్టి కోర్టును ఆశ్రయించడంతో అప్పటినుంచి ఈ పనులు ఆగిపోయాయి. దీంతో మేడారం భక్తులకు రవాణా సౌకర్యానికి మోక్షం కలగలేదు.

14 కిలోమీటర్ల మట్టిరోడ్డు

మేడారం మహాజాతరకు కొండాయి మీదుగా మేడారం చేరుకునే భక్తులకు ప్రతీ జాతరకు అవస్థలు తప్పడం లేదు. ఈ రహదారి మీదుగా రావాలంటే 14 కిలోమీటర్ల మట్టి రోడ్డుపై ప్రయాణించాల్సిందే. జాతర జరిగినప్పుడల్లా ఈ రహదారిపై తాత్కాలికంగా మట్టి పోసి గుంతలు పూడ్చుతున్నారు తప్ప.. శాశ్వత పనులు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో సెప్టెంబరులో సంభవించిన వరదలకు ముంపునకు గురైన కొండాయి పరిసర గ్రామాలకు ఇటీవల ప్రత్యామ్నాయ రహదారి కోసం ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి కోండ్రెడ్ వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టి మట్టిరోడ్డుకు మళ్లీ మరమ్మతులు చేపట్టారు. దీంతో శాశ్వత నిర్మాణం లేక ఫిబ్రవరిలో జరిగే మహాజాతరలో కూడా ఈ మట్టి రోడ్డుపైనే భక్తులు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.


మట్టితో అస్తవ్యస్తంగా తయారైన కొండాయి - మేడారం రోడ్డు


కోండ్రెడ్ వద్ద నిర్మించిన పైప్ కాజ్‌వే

కోర్టులో కేసు ఉంది..

రఘువీర్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

కొండాయి-మేడారం రోడ్డు నిర్మాణానికి రూ. 29కోట్ల వ్యయంతో శ్రీకారం చుట్టాం. కొండాయి రోడ్డును ఐదు శ్లాబ్ కల్వర్టులు, నాలుగు పైప్ కల్వర్టులు రోడ్డు వైండింగ్‌పనులు రూ.2.5కోట్లతో పూర్తి చేశాం. అటవీ శాఖ అధికారులు ఈ పనులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు పరిష్కారమైతేనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

కోర్టు అనుమతితో చేసుకోవచ్చు..

శిరీష్, వైల్డ్‌లైఫ్ రేంజ్ ఆఫీసర్, తాడ్వాయి

మేడారం భక్తులను ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. కేవలం అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసమే అటవీశాఖ కోర్టును ఆశ్రయించింది. ఇందుకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. 2018లో నమోదైన ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు నడుస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ వారు కోర్టు అనుమతి తీసుకుని పనులు చేసుకోవచ్చు. ఇప్పుడు రోడ్డు నిర్మాణ పనులు చేసుకునే విషయమై మాకు ఎలాంటి ఆదేశాలు లేవు.


గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

మేడారంలో కోలాహలం

ఆదివారం లక్షమందికి పైగా తరలివచ్చిన భక్తులు

మేడారం, జనవరి 14: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మల సన్నిధి కిక్కిరిసింది. తల్లులను దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం తండోపతండాలుగా తరలివచ్చారు. సుమారు లక్షమంది సందర్శించారని ఈవో రాజేంద్రం తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో మేడారం వచ్చిన భక్తులు ముందుగా జంపన్నవాగు పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకొని పూజాలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు.



బంగారం మొక్కును సమర్పించేందుకు వస్తున్న భక్తులు

సౌకర్యాలు లేక ఇబ్బందులు

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న తమకు సరైన సౌకర్యాలు లేవని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, మహిళలు దుస్తువులు మార్చుకునే గదులు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ లాంటి ముఖ్యమైన సౌకర్యాలను కూడా అధికారులు సమకూర్చడం లేదని అంటున్నారు. మహాజాతరకు ముందుగానే వస్తున్న తమకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


క్యూలైన్‌లో వస్తున్న భక్తులు


జంపన్నవాగులో స్నానాలు చేస్తున్న భక్తులు

గల్లీలో ఎవరున్నా.. ఢిల్లీలో మోదీ ఉండాలి..

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 350సీట్లు ● కొత్తకొండ దేవాలయాభివృద్ధికి రూ.10లక్షలు ● ఎంపీ బండి సంజయ్


కొత్తకొండలో గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

భీమదేవరపల్లి, జనవరి 14: గల్లీలో ఏ పార్టీ ఉన్నా.. ఢిల్లీలో మాత్రం నరేంద్రమోదీ ప్రభుత్వం ఉండాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారులకు బండి సంజయ్ మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అయోధ్య రామమందిర నిర్మాణాన్ని ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. రామ మందిరం అక్షింతలను పంపిణీ చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. బీజేపీ పార్టీ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానన్నారు. తాను పార్టీకి కట్టుబడి ఉంటానన్నారు. బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌తో తనకు ఎలాంటి శత్రుత్వం లేదన్నారు. బీజేపీ పార్టీ రాబోయే ఎన్నికల్లో సొంతంగా 350 సీట్లు గెలుపొందుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేస్తే మూసీనదిలో వేసినట్లేనని విమర్శించారు. కేసీఆర్ కొడుకు కేటీఆర్‌ను విమర్శిస్తే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కోపం వస్తోందన్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒకటేనని ఆరోపించారు. తమ పిల్లలు మంచి బట్టలు వేసుకుంటే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. అయోధ్యలోని రామమందిరం ప్రారంభానికి రాకపోతే బాబ్రీమసీద్ ప్రారంభోత్సవానికి పోతారా అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు ఉన్న అహంకారంతోనే బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓటమి పాలైందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సంస్కారం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. కొత్తకొండ దేవాలయంలోని శివాలయం అభివృద్ధికి రూ.10లక్షలు ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తానని బండి సంజయ్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి మాచర్ల కుమార్‌గౌడ్, మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, జిల్లా నాయకులు దొంగల కొంరయ్య, మండల శాఖ ప్రధాన కార్యదర్శి గోదాల సంపత్, గుండేల్లి సదానందంయాదవ్, అంబీరు కవిత, నోముల భిక్షపతి, ఆయిత సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రా.. శరభ.. శరభ..

● వీరభద్రనామస్మరణతో మార్మోగిన కొత్తకొండ ● గుమ్మడి కాయలు, కోరమీసాలు చెల్లించుకున్న భక్తులు

భీమదేవరపల్లి, జనవరి 14: వీరభద్రా.... శరభ.. శరభ.. అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం మార్మోగింది. వీరభద్రస్వామి నామస్మరణతో పులకించిపోయింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, వీఐపీ దర్శనం, సర్వ దర్శనం.. ఇలా అన్ని క్యూలైన్లు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ఆలయంతోపాటు పరిసర ప్రాంతాలు వీరభద్ర నామస్మరణతో మార్మోగాయి. పవిత్ర కోనేరులో స్నానాలచరించిన అనంతరం పుట్టు వెంట్రుకలు అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దర్శనం కోసం భక్తులు మూడు నుంచి నాలుగుగంటల పాటు వేచి చూశారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోడెలను కట్టారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడి కాయలు భక్తులు అప్పజెప్పారు. తమ గండాలు తొలగాలని గండాదీపంలో నూనె పోశారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ ఏసీ సునీతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 400 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 మంది జాతరలో పలు సేవలందించారు. ఆలయ ఈవో కిషన్‌రావు జాతరకు పాలకవర్గ కమిటీ లేకపోవడంతో అన్ని తానై ఏర్పాట్లను పర్యవేక్షించాడు. సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌లు జాతరకు వచ్చి స్వామివారికి గుమ్మడికాయ మొక్కులు, కోరమీసాల మొక్కులు చెల్లించారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన క్యూలైన్లు


వీరఖడ్గాలు వేస్తున్న వీరముష్టిలు

భోగి సందర్భంగా ప్రత్యేక పూజలు

భోగి పండుగను పురస్కరించుకొని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సూర్య యంత్ర ప్రతిష్టాపన, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, మహాన్యాసపూర్వ రుద్రాభిషేకం, పుణ్యాహవచనం నిత్య బలిహరణ, అమ్మరికి శ్రీచక్రార్చన, నవావరణ పూజ చండీహోమం నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని నందీశ్వర పూజలు చేశారు. దక్షిణాయనం నుంచి సూర్య భగవానుడు ఉత్తారాయంలోకి ప్రవేశించే సమయంలో ఎవరైతే వీరభద్రుడిని ఆరాధిస్తారో వారికి శత్రుపీడ, శరీర పీడ దరి చేరవని పురాణాలు చెబుతున్నాయి.

ప్రారంభమైన ఎడ్లబండ్లు

ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలలో కుమ్మరులు బోనాలను వండి తమ ఎడ్లబండ్లను ప్రదక్షిణలు చేసిన తర్వాత రోజు నుంచి ఎడ్లబండ్ల కార్యక్రమం జరగడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. దీంట్లో భాగంగా కుమ్మరులు ఆదివారం సాయంత్రం బోనం గద్దె వద్ద వీరభద్రుడికి వీరబోనం చేశారు. కుమ్మరులు బోనాలను నెత్తిన పెట్టుకొని వీరభద్రుడికి ఇష్టమైన ప్రభలతో వెళ్తుండగా శివసత్తులు వీరబోనంతో గటంకుండతో నృత్యాలు చేశారు. వీటి వెనుక అందంగా అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కుమ్మరులు వీరభద్రుడిని దర్శించుకున్నారు. మొదటగా గద్దె వద్ద బోనం సమర్పించారు. కడిపికొండ, ఉల్లిగండ దామెరకు చెందిన మహిళలు గుమ్మడికాయలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు.

నేడు సంక్రాంతి బండ్లు తిరుగుట

కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎడ్లబండ్లు తిరుగుతాయి. కొత్తపల్లి గ్రామస్థులు రథోత్సవం జరుగుతుంది. ఎడ్లబండ్లను అందంగా తీర్చిదిద్ది రథాలుగా కొత్తపల్లి నుంచి ఊరేగింపుగా జాతరకు వస్తారు. కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.


శ్రీవీరభద్రస్వామి


శ్రీభద్రకాళి అమ్మవారు


గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న యువతీ, యువతులు


కుమ్మర ఎడ్లబండ్లు

మార్మోగిన మల్లన్న క్షేత్రం

● అంతా పసుపుమయం.. పరవశించిన భక్తజనం ● సందడిగా ఐనవోలు ఆలయ ప్రాంగణం ● నేడు ప్రభ బండ్ల ప్రదర్శన

ఐనవోలు, జనవరి 14: 'ఐలోని మల్లన్న దండాలో.. నన్నేలు నా తండ్రి దండాలు.. గండాలు తీరితే గండ దీపం పెడుతాం... కోరికలు నెరవేరితే కోడెలను కడుతాం.. పంటలు పండితే పట్నాలు వేస్తాం.. పిల్లజెల్ల సల్లంగా ఉంటే శేవాలు తీస్తాం..' శివమెత్తిన శివసత్తుల ఢమరుకనాదాలతో మల్లికార్జునస్వామి ఆలయం మార్మోగింది. ఒగ్గు పూజారుల ఢమరుకాల హోరు.. టెంకాయ బంధనాలు.. భోగి పర్వదినమైన ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మొక్కులు తీర్చేందుకు బారుల్లో భక్తులు గంటల తరబడి నిలుచుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు మొక్కులు చెల్లిస్తూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. శీఘ్ర దర్శనం, విశిష్ట దర్శనం క్యూలైన్లలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు 4 గంటల సమయం పట్టింది. ఆలయ ప్రాంగణంతోపాటు పరిసరాల్లోని వ్యవసాయ భూముల్లో విడిదిచేశారు. అందంగా బోనాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేసి మల్లన్నను స్తుతించారు. బోనాలపై దీపాలు వెలిగించి శివతాండవం చేస్తూ ఆలయం చుట్టు ప్రదక్షణలు చేశారు. సోమవారం జరిగే మహాజాతరకు భక్తులు భారీగా రానున్నారు.


భక్తులతో నిండిపోయిన ఐనవోలు ఆలయ ప్రాంగణం

దర్శించుకున్న ప్రముఖులు

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ ఎంపీపీ మార్నేని మధుమతి తదితరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

బీఆర్‌ఎస్ నేతల అసహనం

స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలు గేటుకు తాళం వేసి ఉండటంతో అసహనానికి గురయ్యారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజ్‌సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు తూర్పువైపు నుంచి ఆలయంలోకి వచ్చారు. ముఖమండపం వద్ద గేటుకు తాళం వేయడంతో 20 నిమిషాలు నిలుచున్నారు. దీంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా ఉత్తర ద్వారం నుంచి వచ్చిన శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ గేటు వద్ద నిలిచిపోయారు. అధికారులు వచ్చి ప్రొటోకాల్ ప్రకారం తీసుకెళ్లి దర్శనం చేయించారు. ఒకేసారి రెండు వైపులా నుంచి నేతలు రావడంతో పోలీసులు గేట్లు తియడానికి ఆలస్యమైందని ఈవో తెలిపారు. అయితే జాతరలో మొదటిసారిగా ఉచిత వీఐపీ పాస్‌లను రద్దుచేశారు. వీవీఐపీపేరిట ఒక్కరికి రూ.500 టిక్కెట్ ఖరారు చేశారు. డీసీసీబీ చైర్మన్ రూ. 50వేలు చెల్లించి 100 పాసులు తీసుకున్నారు.

శివలింగానికి అలంకరణ

భోగి పర్వదినం ఆదివారం రోజున మల్లికార్జునస్వామి వారికి ఒగ్గుపూజారులు మేలుకొలుపు చేశారు. శైవాగమ పద్ధతిలో అర్చకులు ప్రాతఃకాలంలో విఘ్నేశ్వరపూజ శైవశుద్ధి పుణ్యాహవాచనం నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములో అర్చకులు 11సార్లు నమ్మకం ఒకసారి చెమ్మకం చెప్పారు. పాలు, పెరుగు, నెయి, తేనే, పంచదార, పండ్లరసం, కొబ్బరినీరు బస్మోదం (విభూది) సువర్ణోదకం, గంధోదకం, బిల్వోదకం, కుశోదకం, రుద్రకదోకంతో మంత్ర పఠనం చేసి స్వామి వారికి అభిషేకం చేశారు. అష్టోత్తర పుష్పాలతో (108) శివలింగాన్ని అలంకరించి మహానివేదన నీరాజన మంత్రపుష్పం తదుపరి తీర్థప్రసాద వితరణ చేశారు.


శివసత్తుల భక్తి పారవశ్యం

నేడు ప్రభ బండ్ల ప్రదర్శన

మకర సంక్రాంతిని పురస్కరించుకుని మల్లన్న సన్నిధిలో సోమవారం ఉత్తరాన పుణ్యాకాలము, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవాచనము మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము బిల్వార్చన. మహానివేదన పూజలు నిర్వహిస్తారు. నీరాజనమంత్ర పుష్పం తీర్థప్రసాద వితరణ తోపాటు రాత్రి ప్రభల బండ్లు ప్రదర్శన, నైవేద్యంతో మార్నేని వంశీయుల దేవుడి రథం తిరుగనుంది.


స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్


స్వామి వారిని దర్శించుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

సంగెం, జనవరి 14: మండల కేంద్రంలో శ్రీరాముని అక్షింతలను గ్రామంలోని ప్రతీ ఇంటికి సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి-నరహరి దంపతులు శనివారం రాత్రి అందించారు. అయోధ్యలో ఈనెల 22 శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరగనున్నందున ప్రతీ ఇంట్లో రాముని అక్షింతలను ఉంచాలని ఆమె సూచించారు. వాడలకు అక్షింతలకు మహిళలు మంగళహారతులలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కోడూరి సదయ్య, మెట్టుపల్లి మల్లయ్య, ఇప్పకాయల మనోహర్, మో హన్, సంపత్, పులి సాంబయ్య, అప్పాల కవిత పాల్గొన్నారు.



అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఎంపీపీ దంపతులు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

గీసుగొండలో జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం

గీసుగొండ, జనవరి 14: కాంగ్రెస్ పార్టీ మండల యూత్‌కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను గీసుగొండ జెడ్పీ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడలను వెలికితీసి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చాడా కొమురారెడ్డి, అల్లం బాలకిశోర్‌రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు

తెల్లవారుజాము నుంచే భోగి మంటలు, ముగ్గుల పోటీలు
ఉత్సాహంగా పాల్గొన్న కాలనీల వాసులు
పిల్లలకు గాలి పటాల పంపిణీ

పోచమ్మమైదాన్, జనవరి 14: ప్రపంచంలోని అన్ని సంప్రదాయాల కంటే సనాతన సంప్రదాయమే గొప్పదని శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. ఫైడిపెల్లిలోని గురుధామంలో (సప్తధామ్) ఆదివారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో భోగి మంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ సమిష్టిగా పండగలు, వేడుకలు నిర్వహించుకునే సంప్రదాయాలను నేటి తరం పాటించాలని సూచించారు. అనంతరం పోటీల విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయినారాయణ, మాధవ్, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, లాయక్ అహ్మద్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్ : సంక్రాంతి పర్వదినం మొదటిరోజున భోగి పండుగ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. 34వ, డివిజన్ శివనగర్‌లోని వాసవికాలనీలో ఆదివారం వేకువజామున మహిళలు ముత్యాల ముగ్గులు వేసి, అనంతరం భోగిమంటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివనగర్, వాసవి కాలనీ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పూల కోసం ఎగబడిన ప్రజలు

సంగెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇంట్లో నిర్వహించే బోనాల పండుగ కోసం బంతి పూలకు గిరాకీ నెలకొంది. ఆదివారం గవిచర్లలో ప్రజలు బంతిపూల కోసం బంతి చేనులకు పరుగులు తీశారు. బంతిపూల కోసం చేను వద్దకు వెళ్లి అక్కడే కొనుగోలు చేశారు. కిలోబంతిపూలకు రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలికింది.

పిల్లలకు పతంగుల పంపిణీ

శంభునిపేట : సంక్రాంతి సందర్భంగా ఆదివారం నగరంలోని 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో పిల్లలకు కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ గాలిపటాలు పంపిణీ చేశారు. రంగశాయిపేట రామాలయంలో ఆలయ పూజారి తిరుమల శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 42, 41 డివిజన్‌ల కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్‌లు పాల్గొన్నారు.



శివనగర్‌లో భోగి మంటలు వేస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

కాశిబుగ్గలో ...

వరంగల్‌టౌన్ : కాశిబుగ్గలో లక్ష్మి గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని పిల్లలకు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా పిల్లల కోసం పతంగులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల సురేష్, వేముల నాగరాజు, దుస్స క్రిష్ణ, మండల చందు, మమిడాల సతీష్, కొలిపాక మహేష్, లింగబత్తుల ఆనంద్, బండారి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథకాలనీలో పిల్లలకు పతంగులు అందిస్తున్న రవీందర్



సంగెంలో బంతి పూలచేనులోకి పూలకోసం వచ్చిన ప్రజలు



కాశిబుగ్గలో పతంగులు పంపిణీ చేస్తున్న పరపతి సంఘం ప్రతినిధులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించాలి



కోటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ-ఎంఎల్, న్యూడెమోక్రసీ నాయకులు

ఖిలావరంగల్, జనవరి 14: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ ప్రభుత్వం చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఖిలావరంగల్ కోటలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలు చేయాలని అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని నిరసన చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాద దేశాల అండతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ జియోనిస్టు హంతకదాడులను తీవ్రంగా ఖండించారు.

రెండవప్రపంచ యుద్ధానికి ముందు ఉన్న పాలస్తీనాను బ్రిటన్, అమెరికాలు పశ్చిమ ఆసియా ప్రాంతంలో తమ ప్రాబల్యం కోసం 1948లో కృత్రిమంగా ఇజ్రాయిల్ దేశాన్ని సృష్టించారని, దీనిని వ్యతిరేకిస్తూ తమ మాతృభూమి రక్షణ కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ జియోనిస్టు హంతక ప్రభుత్వం ఊచకోత కోస్తుందన్నారు. కార్యక్రమంలో న్యూడెక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్, ఐఎఫ్‌టీయూ నాయకులు బండికుమార్, సారంగపాణి, మైదం సంజీవ, వేణుగోపాల్, గద్దల సంజీవ, మైదం శ్యామ్, ఇనుముల కృష్ణ, హరిబాబు, చంద్రమౌళి, సుద్దాల వీరన్న పాల్గొన్నారు.



దేవాలయంలో శ్రీగోదారంగనాథస్వామి తిరుకళ్యాణోత్సవం

ఘనంగా గోదారంగనాథస్వామి తిరుకల్యాణోత్సవం

గిర్మాజీపేట, జనవరి 14 : నగరంలోని గోవిందరాజస్వామి దేవాలయంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా శ్రీగోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవం వైభవోపేతంగా భక్తిప్రపత్తులతో జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మణ్‌స్వామి తదితర అర్చకులు ముందుగా విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, ఆరాధన చేశారు. కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ దంపతులు గోదాదేవి, రంగనాథస్వామిని దర్శించుకుని గోదాదేవి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో చింతాకుల సునీల్ కుమార్, యిప్ప ఆదినారాయణలతో పాటుగా భక్తులు కల్యాణాన్ని వీక్షించారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

గీసుగొండ, జనవరి 14: గీసుగొండ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి బండారు రవికుమార్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందచేశారు. రవికుమార్ వంచనగిరి మోడల్‌స్కూల్లో టెన్త్ చదివి, బాసర ఐఐటీలో బీటెక్ చేయగా అమెరికాలో చదివేందుకు అవకాశం లభించింది. ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటంతో కిశోర్‌రెడ్డి స్పందించి రూ.50వేల ఆర్థికసాయం అందించారు. అలాగే గీసుగొండలో అనారోగ్యంతో మృతిచెందిన అవయవాలను దానం చేసిన కర్ణకంటి శ్రీకాంతాచారి కుటుంబానికి రూ.10 అందించారు. అనంతరం ఆయన మొగిలిచర్లలో క్రికెట్ పోటీలను ప్రారంభించి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీకాంత్, చాడా కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, దౌడు భరత్, ఆకుల రుద్రప్రసాద్, కర్ణకంటి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో 12 గొర్రె పిల్లల మృతి

శంభునిపేట, జనవరి 14 : దొడ్లో ఉంచిన గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రంగశాయిపేటకు చెందిన ఇట్టబోయిన ప్రసాద్ ఎంబీఏ చదువుకొని తమ కుల వృత్తిలోని గొర్రెల పెంపకం వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఆదివారం భోగి పండుగ ఉందని మేతకు తోలుకుపోయిన గొర్రె పిల్లలను మధ్యాహ్నం వరకే ఇంటికి తీసుకువచ్చాడు. దొడ్లోకి ఓ వీధి కుక్క చొరబడి గొర్రెల మందపై దాడి చేసింది. ఈ ఘటనలో 12 గొర్రె పిల్లలు మృతి చెందగా కొన్ని గాయాలపాలయ్యాయి. ఉద్యోగం దొరక్క బ్యాంకుల్లో లోన్ తీసుకొని గొర్రెల పెంపకం చేపడితే ఇలా జరిగిందన్నాడు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు ప్రసాద్ వాపోయాడు.



మృతి చెందిన గొర్రెలతో పెంపకందారుడు

మ్యాన్‌హోల్‌లో పడిన ఆటో.. డ్రైవర్ మృతి



గుంతలో పడిన ఆటో, మృతిచెందిన డ్రైవర్ మల్లేశం

గీసుగొండ, జనవరి 14: ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఇటుకల మల్లేశం(51) మిషన్ భగీరథ మ్యాన్‌హోల్‌లో ప్రమాదవశాత్తు ఆటోతో సహా పడి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం. మల్లేశం ఎన్‌టీఆర్ నగర్‌లో ఉంటూ కీర్తినగర్‌లో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం కీర్తినగర్ నుంచి ఎన్‌టీఆర్ నగర్‌కు ఆటోలో వస్తుండగా బొడ్రాయి వద్ద అసంపూర్తిగా నిర్మించిన మిషన్ భగీరథ మ్యాన్‌హోల్‌లో ఆటో ముందు టైర్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో ఆటో ముం దుగల అద్దాలు పగిలి మల్లేశం మెడనరాలు తెగడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి



అనిల్(ఫైల్)

సంగెం, నవంబరు 14: కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య గొడవ జరగ్గా, భార్య, ఆమె కుటుంబ సభ్యుల దాడిలో ఓ పెయింటర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదివారం మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గవిచర్లకు చెందిన బాసిపాక అనిల్(36) అదే గ్రామానికి చెందిన సుధను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, అనిల్ పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మనస్పర్థలతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. సుధ ఐదు నెలల క్రితం భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. ఈనెల 3న అత్తారింటికి వెళ్లిన అనిల్, తనతో ఇంటికి రావాలని సుధను పిలువడంతో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో సుధ సోదరుడుతోపాటు పలువురు అతడిపై దాడి చేయడంతో అనిల్ అస్వస్థతకు గురికాగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సుధ, ఆమె కుటుంబ సభ్యుల చిత్రహింసల కారణంగానే తన సోదరుడు అనిల్ మృతిచెందాడంటూ ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భరత్ తెలిపారు.

పండుగ పూట విషాదం

(5వ పేజీ తరువాయి)



ప్రమాదానికి ముందు నాగార్జునసాగర్ బుడియాబాపు గుడి వద్ద దిగిన ఫొటో

కొవిడ్‌తో గతంలో మృతి చెందగా, సొంతంగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గుంజేడు ప్రాంతంలో యానిమల్ ట్రాకర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, శ్రీనివాస్ తల్లి, ఇద్దరు పిల్లలు, అత్త, బావమరిదిని తీసుకొని ఈ నెల 13న సొంత ఆటోలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపాన ఉన్న బుడియాబాపు గుడికి తనతోపాటు తన కుమారుడిని తలనీలాలు ఇవ్వడానికి వెళ్లాడు. ఆదివారం తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్ జిల్లా 365 జాతీయరహదారిపై కంబాలపల్లి అర్బన్ పార్కు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

కాగా, కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మగుడికి నలుగురు మిత్రులతో వెళ్లి తిరిగి వస్తున్న మహబూబాబాద్ మండలం మల్యాల పీహెచ్‌సీ డాక్టర్ బాదావత్ తిరుపతితోపాటు కురవి మండలానికి చెందిన గుగులోత్ ప్రవీణ్, మాలోత్ భరత్, మహేష్, వసంత్‌లు కూడా గాయపడ్డారు. కారు నడిపింది డాక్టర్ తిరుపతి అని పోలీసులు తెలిపారు. మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం జాయిన్ చేశారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి
ఛాగల్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 14: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఛాగల్ గ్రామంలో కడియం ఫౌండేషన్, స్వాగత్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన 16వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువకులు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా ప్రభుత్వం క్రీడా క్యాలెండర్‌ను తీసుకురావాలన్నారు. డివిజన్ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియం పనులను పూర్తి చేయించి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తానని అన్నారు. గ్రామీణ క్రీడాకారులే నేడు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత డ్రగ్స్, గంజాయితో చిత్తు అవుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం వాటిని నిర్మూలించే చర్యలు చేబట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించడం సంతోషకరమన్నారు. డ్రగ్స్ పైనే కాకుండా గంజాయి, బెల్టు దుకాణాలను కూడా రద్దు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విజేతలుగా నిలచిన జట్లకు బహుమతులు అందించారు.

విజేతలుగా నిలచిన జట్లు..

ఛాగల్‌లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో 50 జట్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నిలిచిన సూర్యాపేట జట్టుకు కడియం ఫౌండేషన్ రూ.60,016 నగదుతో పాటు షీల్డును, అదేవిధంగా రెండో స్థానంలో నిలిచిన జనగామ జట్టుకు రూ.40,016లతో పాటు షీల్డు ను కడియం ఫౌండేషన్ తరపున శ్రీహరి అందించారు. మూడో బహుమతిని జేఎస్ఎస్ జట్టుకు షీల్డుతో పాటు రూ.30,016లు, నాలుగో బహుమతి స్వాగత్ యూత్ ఛాగల్ జట్టుకు రూ 20,016తో పాటు షీల్డును, ఐదో స్థానంలో నిలిచిన పీచర జట్టుకు రూ 15,016లు షీల్డును, ఆరో స్థానంలో నిలిచిన గోవర్ధనగిరి జట్టుకు రూ.10,016లతో పాటు షీల్డును పలువురు దాతలు అందించారు.

కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, నాయకులు మారజోడు రాంబాబు, ఉప సర్పంచ్ పొన్న రజిత రాజేష్, అన్నెపు ఐలయ్య, అన్నెపు కుమార్, పొన్న రాజేష్, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, రంగు యాకయ్య, సొదరపల్లి సంపత్‌రాజ్, పీఈటీలు చందర్, సుధాకర్, రాజు, షఫీర్, మహేష్ పాల్గొన్నారు.



సూర్యాపేట జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జాతీయ సెమినార్‌కు మరియపురం సర్పంచ్ బాలిరెడ్డి

గీసుగొండ, జనవరి 14: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించే హెల్త్ గ్రామపంచాయతీ జాతీయ సదస్సుకు ఆహ్వానం లభించింది. తెలంగాణ నుంచి ఇద్దరు సర్పంచ్‌లు ఎంపిక కాగా అందులో అల్లం బాలిరెడ్డి ఉండటం విశేషం. ఈనెల 18 నుంచి 20 వరకు తిరుపతిలో జాతీయ సదస్సు జరగనుంది. గ్రామంలో ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం, గ్రామంలో ఏర్పడిన చెత్తాచెదారాన్ని కాల్చకుండా వర్మీ కంపోస్ట్ ద్వారా ఎరువులను తయారు చేసి ఆదాయం పొందటం, గ్రామంలోని ప్రతీ మహిళ శానిటేషన్ కిట్‌ను వాడటం ఈ గ్రామం ప్రత్యేకతగా నిలిచింది. దీంతో సర్పంచ్ బాలిరెడ్డిని జాతీయ సెమినార్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించారు.

గత 5 సంవత్సరాలుగా విభిన్న ప్రత్యేకతలు కలిగిన గ్రామాలను జాతీయ సెమినార్‌లకు ఆహ్వానిస్తుండగా వరుసగా 5వ సారి 8 ప్రాధాన్యత అంశాలలో మరియపురం సర్పంచ్‌కు ఆహ్వానం లభించటం అభినందనీయమని మండల అధికారులు తెలిపారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 15 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

సాగు నీటిని అందించాలి



సంగెం కాలువను పరిశీలిస్తున్న రైతులు

ఖానాపురం, జనవరి 14 : పాకాల ఆయకట్టులో యాసంగి సాగు కోసం సాగునీటిని అందించాలని సంగెం కాలువ పారకం పరిధిలోని బుధరావుపేటకు చెందిన రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. బుధరావుపేట శివారులోని సంగెం కాలువకు జేసీబీ సాయంతో అడ్డు కట్ట వేస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ పాకాల ఆయకట్టులో యాసంగి తైబందీ ప్రకటన వెలువడిన తరువాతనే వరి నార్లు పోసుకొని సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో సాగు నీటిని అందించకుండా కాలువకు అడ్డుకట్టవేయడం తగదన్నారు. ముందస్తుగా ప్రకటించినట్లుగానే సాగుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు ఎల్లయ్య, నాగరాజు, పాషా, ఐలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు అందాల పోటీలు



విజేతకు బహుమతులను అందజేస్తున్న శాంతిసేన రైతు సంఘం సభ్యులు, ఏడీ నరసింహారెడ్డి

నర్సంపేట, జనవరి 14 : సంక్రాంతి పండగను పురస్కరించుకొని నర్సంపేటకు చెందిన శాంతిసేన రైతు సంఘం నిర్వహించిన పశువుల అందాల పోటీలు రైతులను, గ్రామస్థులను అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. పట్టణంలోని బాలుర హై స్కూల్ ఆవరణలో ఆదివారం పోటీలను నిర్వహించారు. పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ పాడి పశువులతో పాటు మేకలు, గొర్రెలు, గేదెలు, జోడెడ్లు, పెంపుడు కుక్కలు, కోళ్లు, లేగదూడలు, కుందేళ్ళు తదితర పశువులతో పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ ఏడీ పాల్గొని పాడి పశువుల అందాల పోటీలను నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. గత కొన్నేళ్ళుగా శాంతిసేన రైతు సంఘం పోటీలను నిర్వహించి రైతులకు ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమన్నారు. పాడి పశువుల పోషణ రైతులకు లాభదాయకమని ఆయన అన్నారు. పాడి పంటలతో పాటు పశువుల పోషణ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. వివిధ విభాగాల్లో పాడి పశువుల అందాల పోటీల్లో గెలుపొందిన పశువులు, పక్షులు, ఇతర జంతులవులను ప్రదర్శనకు తీసుకు వచ్చిన రైతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలైన సురేందర్, రాదారపు రాజన్న, పాలాయి ప్రవీణ్, కొత్త హరీశ్‌రెడ్డి లతో పాటు ఇతర జంతువులకు లభించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను షీల్డులతోపాటు నగదు పారితోషికాన్ని పశుసంవర్ధక శాఖ ఏడీ నరసింహారెడ్డి, శాంతిసేన సంఘం అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి సభ్యులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో శాతిసేన సంఘం సభ్యుడు ఎర్ర యాకూబ్‌రెడ్డి, యుగందర్, గంప రాజేశ్వర్, సంఘం కార్యదర్శి తౌటి వెంకట నారాయణ, ముఖ్య సలహాదారులు చిలువేరు వెంకటేశ్వర్లు, రేమిడి శ్రీనివాస్, చింతల సాంబరెడ్డి, పుల్లూరి చిన్నరవి, ఎస్సై రవికుమార్, నాలు దాతలు, రైతులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 300లకు పైగా పాడిపశువులు పాల్గొన్నాయి,



అందాల పోటీలకు వచ్చిన ఆవులు, చీమకోడి

సాగు నీటిలో జాగ్రత్తలు తప్పనిసరి

• రాయపర్తి ఏవో వీరభద్రం



ఏవో వీరభద్రం

రాయపర్తి, జనవరి 14 : పంటకు ప్రధాన జీవనా ధారం సాగునీరు, నీరు ఎక్కువైనా, ఎద్దడి తలెత్తినా పంట దిగుబడి పైనా, భూసారం పైనా తీవ్ర ప్రభావాలను చూపుతుంది. భూమి, పంటల తత్వాలను బట్టి సాగునీరు అందించాల్సి ఉంటుంది. ఇలాంటి శాస్త్రీయ అంశాలపై సాధారణ రైతులకు సైతం అవ గాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాగు నీటిలో ఉండే సహజ లక్షణాలు, పంటకు నీరు ఉపక రించే పద్ధతులపై రాయపర్తి ఏవో వీరభద్రం పలు సూచనలు చేశారు.

• నాణ్యతతోకూడిన సాగునీటిని అందజేస్తే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. నాణ్యత లోపిస్తే భూమిలో భౌతిక లక్షణాలు దెబ్బతింటాయి. బరువైన భూములు తడిగా ఉన్న సమయంలో ఆరుదలకు రావు. క్షార గుణం ఉన్న నీటితో వరి సాగుచేయడం ప్రయోజనకరం కాదు. క్షార జలంతో సాగుచేసే పంటల్లో జింకు లోపం వచ్చే అవకాశాలున్నాయి. మురుగు కాల్వల్లోని నీటిలో బైకార్బునేట్లు ఎక్కువగా ఉంటాయి. ఈ స్థితి దిగుబడికి ప్రతికూలంగా ఉంటుంది. సాగు నీరు క్షార స్వభావం కలిగి ఉంటే మెగ్నిషియం తక్కువగాను, సోడియం అధికరంగాను ఉంటుంది. సోడియంవల్ల మొక్కలకు హానీచేసే పరిస్థితికలుగుతుంది.



పొలాన్ని దున్నుతున్న రైతు (ఫైల్)

• **సాగునీరులో నాణ్యత తగ్గితే**

205మిల్లీ లీటర్ల కంటే తక్కువ సోడియం కార్బోనేట్ ఉన్న నీటితో పంటకు మేలు ఎక్కువ కలుగుతుంది. సోడియం కార్బోనేట్లు 2.5 నుంచి నాలుగు మిల్లీ లీటర్ల మధ్యలో ఉంటే సాగు భూమికి జిప్సం వేయాల్సి ఉంటుంది.

• **వినియోగం ఇలా ఉండాలి**

పై భాగాన భూములున్న రైతులు అవగాహన లేక ఎక్కువ నీటిని వినియోగం చేస్తుండడంవల్ల సుమారు 20శాతం మంది పల్లపు రైతులు సాగునీటి సమస్య ఎదుర్కొంటుంటారు. పంట దశల్లో సకాలంలో నీరందక పల్లపు ప్రాంత రైతులకు దిగుబడి తగ్గుతుంది. నేలలో పైరుకి తడి 75 శాతం వరకు తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అలాగని అవసరం లేకుండా ముందస్తుగా నీరు పెట్టినా ప్రాణవాయువు దక్కక నష్టం కలుగుతుంది. అ అపసవ్య పరిస్థితుల వల్ల పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పల్చగాను, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు రెండు నుంచి మూడు సెంటీమీటర్ల నీరు ఉండాలి. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు ఐదు సెంటీ మీటర్ల నీరుండాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.



నారుమడి

ఘనంగా భోగి పండుగ వేడుకలు



నర్సంపేటలో గంగిరెద్దుల వారికి బియ్యం అందిస్తున్న మహిళ

నర్సంపేట, జనవరి 14 : నర్సంపేట ప్రాంత ప్రజలు భోగి పండుగ వేడుకలను ఆదివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తెల్లవారు జామునే నువ్వులు, రేగుపండ్లు, నీళ్లలో వేసి తంటు స్నానమాచరించి ఇళ్ల ముంగిళ్ళలో రంగు రంగుల ముగ్గులను వేశారు. ముగ్గుల నడుమ ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను పెట్టి నువ్వులు, రేగు పండ్లు, బంతి తదితర పూలను వేసి పండుగ వేడుకలను జరుపుకున్నారు. భోగి పండుగ నాడు ఇంటి ముం గిళ్లకు గంగిరెద్దులు వచ్చాయి. గంగిరెద్దులకు మహిళలు పూజలు చేశారు. గంగిరెద్దుల వాళ్లకు వివి.ద రకాల పిండి వంటలు, బియ్యం, ధాన్యం, నగదును దానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని వరంగల్‌రోడ్‌లో గ్రీన్ రిసార్ట్‌లో డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివెల్ వేడుకలను నిర్వహించారు. అనంతరం భోగి మంటల కార్యక్రమాన్ని కామెడియన్ గీతసింగ్‌తో కలిసి నిర్వహించారు. కార్య క్రమంలో డాక్టర్ లెక్కల విద్య, మేనేజర్ శ్రీకాంత్, పలు వురు ప్రముఖులు, యువతీ,యువకులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో భోగి పర్వ దినాన్ని పురస్కరించుకొనిఆలయాల్లో పలు వేడుకలు, ఉత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలు త మ ఇళ్లముందు రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దుకు న్నారు. ప్రతీ ఇంటి ముందు అందమైన ముగ్గులతో అలంకరించి, గొబ్బెమ్మలను పెట్టి పూజించారు.

• వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా భోగి వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే ఇంటి ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు, గరిక పోసలు, నవ ధాన్యాలు పోసి రంగులు వేశారు. అనంతరం స్థానిక ఆలయాల్లో దైవదర్శనం చేసుకుని ధనుర్మాస ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

• రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో భోగీ పండుగ ఉత్సవాలు జరిగాయి. గ్రామాల్లో భోగి మంటలు పెట్టి పాత వస్తువులను మంటల్లో వేసి దహనం చేశారు. వేకువ జామునే మహిళలు ఇంటి ముందు కల్లాపి చల్లి రంగుల ముగ్గులు వేసి గొబ్బిల్లు పెట్టి అలంకరించారు. నూతన వస్త్రాలు ధరంచి దేవుడిని ప్రార్థించుకుని మొక్కులు చెల్లించారు. భోగీ పండుగ రోజున ఐదేళ్ల లోపు పిల్లలకు తల్లిదండ్రులు భోగి పండ్లుపోసి బాలఅరిష్టాలు ఉండకూడదని, దిష్టి తొలగాలని ఆరోగ్యంగా ఉండాలని మొక్కుకున్నారు.

• నెక్కొండ/చెన్నారావుపేట : మండలాల్లోని పలు గ్రామాల్లో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు. యువతులు, చిన్నారులు ఇంటి ముందర రంగు రంగుల ముగ్గులను వేసి మధ్యలో గొబ్బెమ్మలను పెట్టారు. పిల్లలు, యువకులు గాలిపటాలను ఎగురవేశారు. పంటలు ఇంట చేరిన వేళ, ఆదివారం ఉదయం వేళ భోగి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.



నర్సంపేటలోని గ్రీన్‌రిసార్ట్‌లో కైట్ ఫెస్టివెల్‌లో పాల్గొన్న బాలబాలికలు

వైభవంగా గోదాదేవి కల్యాణ మహోత్సవం



లింగగిరిలో లక్ష్మీచెన్నకేశవస్వామి గోదాదేవి కల్యాణం



బుధరావుపేటలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం



వెంకటేశ్వరపల్లిలో గోదాదేవి రంగనాథుల కల్యాణం

చెన్నారావుపేట, జనవరి 14 : మండలంలోని లింగగిరి గ్రామంలో ఉన్న పెద్దగుట్టపై వెలిసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి జాతరలో భాగంగా రెండోవ రోజు భోగి పండుగను పురస్కరించుకొని లక్ష్మీచెన్నకేశవస్వామి గోదాదేవి కల్యాణ మహోత్సవ వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మామిడి ఆకుల తోరాణాల తో ఊరేగింపుగా తీసుక వచ్చి ఆలయంలో అలంకరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాదారపు భాస్కర్, గంగా, చీకటి స్వాతి-రాజు, బూర్గు సూరయ్య, విజయ, దంపతులు ఆలయ కమిటీ బాధ్యులు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకవచ్చి గుట్టపై ఉన్న స్వామి వారికి సమర్పించారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవ స్వామి, అతని భార్యలైనా భూదేవి, శ్రీదేవిల దేవాతామూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గుట్టపై ఉన్న ఆలయ ఆవరణలో స్వామివారి గోదాదేవి కల్యాణం మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనచార్యులు, రమణాచార్యులు వేద మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. అలాగే దేవతామూర్తుల ను విగ్రహాలను గుట్టపై ఉన్న గుడిలో ప్రతిష్ఠించగానే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. గుడి ముందున్న ధ్వజ స్తంభం వద్ద భక్తులు కొబ్బరి కాయలను కొట్టి తమ ముడుపులను చెల్లించుకున్నారు. అలాగే నెక్కొండ సీఐ హతీరాంనాయక్, చెన్నారావుపేట ఎస్సై పస్తం శ్రీనువాస్‌లు ప్రత్యేక పూజలను చేపట్టారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ హతీరాంనాయక్, ఎస్సై పస్తం శ్రీనువాస్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లం సాగర్‌గౌడ్, రాకం వేణు, ఉప సర్పంచ్ బూర్గు రాజశేఖర్, చీకటీ పెద్ద వెంకటేశ్వర్లు, రాజు, దాసరి అశోక్, అనుముల అశోక్, తాడెం ప్రభాకర్, కార్యదర్శి శ్యామ్ ప్రసాద్, దాసరి రమేష్, నర్సింహ రాములు తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసంలో చివరి ఘట్టమైన గోదారంగనాథస్వామి కల్యాణం అర్చకులు వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కలకోట గోపాలచార్యులు, కలకోట శ్రణాచార్యులు, రామాచార్యులు, శ్రీభాష్యం వెంకటరమణాచార్యులు, శేషం రమణచార్యులు, ఆచ్చి శేషశయనచార్యులు గోదాదేవి కల్యాణం రంగనాథస్వామితో ఆలయంలో ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలోకి మేళతాళాల మధ్య తీసుకొచ్చారు. అనంతరం కన్యాదానం తదితర కార్యక్రమాలు వేద మంత్రాల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కుమారుడు దిలీప్‌రాజ్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : మండలంలోని బుధరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ఖానాపురం సీతా రామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధరావుపేటలో ఇందుర్తి పల్లవిరాజారెడ్డి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయఅర్చకులు పర్వతపు శివప్రసాద్ శాస్త్రీ, వేణుస్వామి, పడగాల కల్పననవీన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మీ వెంకట నర్సయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పగడాల రాం నర్సింహ రెడ్డి, గిరగాని నర్సయ్య, పగడాల పద్మ, బైరెడ్డి మంజుల, సునిత, యశోద, పిచ్చిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లిలో స్వయం వక్తగా వెలసిన సన్నూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదా రంగనాథుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల రంగాచార్యులు, రామకృష్ణచార్యులు, వెంకటరామాచార్యులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ధర్మకర్తల ఆధ్వర్యంలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పచ్చని పందిళ్ల నడుమ గోదాదేవి కల్యాణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ కల్యాణానికి రాయపర్తి మండలంతో పాటు తొర్రూరు, కొడకండ్ల తదితర గ్రామాల నుంచి భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు రామకృష్ణరెడ్డి, కుందూరు రమేశ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం

(5వ పేజీ తరువాయి)

కొవిడ్‌తో గతంలో మృతిచెందగా, సొంతంగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గుంజేడు ప్రాంతంలో యానిమల్ ట్రాకర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, శ్రీనివాస్ తల్లి, ఇద్దరు పిల్లలు, అత్త, బావమరిదిని తీసుకొని ఈ నెల 13న సొంత ఆటోలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపాన ఉన్న బుడియాబాపు గుడికి తనతో పాటు తన కుమారుడిని తలనీలాలు ఇవ్వడానికి వెళ్లాడు. ఆదివారం తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్ జిల్లా 365 జాతీయరహదారిపై కంబాలపల్లి అర్బన్ పార్కు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

కాగా, కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మగుడికి నలుగురు మిత్రులతో వెళ్లి తిరిగి వస్తున్న మహబూబాబాద్ మండలం మల్యాల పీహెచ్‌సీ డాక్టర్ బాదావత్ తిరుపతితోపాటు కురవి మండలానికి చెందిన గుగులోత్ ప్రవీణ్, మాలోత్ భరత్, మహేష్, వసంత్‌లు కూడా గాయపడ్డారు. కారు నడిపింది డాక్టర్ తిరుపతి అని పోలీసులు తెలిపారు. మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం జాయిన్ చేశారు.



ప్రమాదానికి ముందు నాగార్జునసాగర్ బుడియాబాపు గుడి వద్ద దిగిన మృతుల ఫొటో



ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ శ్రీను, రుత్విక, రుత్విక్, పాప

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

• వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ఎమ్మెల్యే నాగరాజుతో కట్ర్యాల కట్ట మల్లన్న కమిటీ సభ్యులు

వర్ధన్నపేట రూరల్, జనవరి 14 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జరుపుకునే జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన కట్ట మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు హన్మకొండలో ఎమ్మెల్యే నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి పంటలు చల్లంగా ఉండాలని మల్లన్న స్వామికి పట్నాలు, బోనాలు సమర్పించే సంక్రాంతి పండుగను ప్రతీ ఒక్కరు సంతోషంగా చేసుకోవాలన్నారు. నియోజక వర్గంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వానికి వివరించి వచ్చే జాతర వరకు ఆ దిశగా పనులు సాగిస్తామన్నారు. నియోకజవర్గ ప్రజలు దీవెన, మల్లన్న ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందానని, అందరి రుణం తీర్చుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్ట వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు గుజ్జ రవీందర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య గ్రామపార్టీ అధ్యక్షుడు బండారి సతీష్, మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్, మైనార్టీ రాష్ట్ర నాయకుడు చోటే, కిసాన్ సెల్ అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్‌రావు, పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

చెన్నారావుపేట, జనవరి 14 : సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక ముగ్గుల పోటీలని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కంది కృష్ణాచైతన్యరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ దినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలను బహుమతులను అందించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా వాకిటి విక్రమ్, రాజు, ఫ్రెండ్స్ యువజన సంఘం అధ్యక్షుడు బాడేపాక నవీన్, ప్రధాన కార్యదర్శి జంగిలి అజయ్, సాదు నర్సింగరావు, జంగిలి కిరణ్, మందుల సాగర్, సింగిరెడ్డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సాంబయ్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

వర్ధన్నపేట రూరల్, జనవరి 14 : జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని ఇల్లంద గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బేతి సుశీల దశదిన కర్మలో పాల్గొన్నారు. వారివెంట జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమార స్వామి, ఎస్ఎంసీ చైర్మన్‌స్వామి రాయుడు, సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఆత్మ డైరెక్టర్ సంతోష్, దేవస్థాన చైర్మన్ వేణు, ఉపసర్పంచ్ రాజు, బొచ్చు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

వర్ధన్నపేట, జనవరి 14 : జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లోనే దళితులకు 15 శాతం రిజర్వేషన్ పెంచాలన్నారు. కుల గణన చేపట్టి 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 60శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్‌చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంజర్ల సమ్మయ్య, కిషన్, తిరుమలేష్, మధు, మిథున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా మురళి



వర్ధన్నపేట, జనవరి 14: తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన పసునూరి మురళిని నియమిస్తూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మాదిగ ఉప కులాలను ఏకంచేసి అగ్రవర్ణాల అహంకారాన్ని తొక్కి పడేయాల్సిన అవసరం ఉందన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన పదవీని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు వితరణ

దుగ్గొండి, జనవరి 14 : అయోధ్యలో రాముడి గుడి ప్రతిష్ఠాపనలో భాగంగా మండలంలోని తిమ్మంపేటలో హనుమాన్ భక్తి మండలి ఆధ్వర్యంలో ఆదివారం అక్షింతల వితరణను సర్పంచ్ మోడెం విద్యాసాగర్, గురుస్వామి రడం రాజేంద ర్‌లు ప్రారంభించారు. గ్రామంలో తిరుగుతూ ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో గిన్నె భాస్కర్, భూమ సదయ్య, మ్యాక రాజయ్య, నల్లబొండ రాజు, కొత్తపెల్లి తరుణ్, దండు శ్రీనివాస్, కోరెం చంద్రమౌళి, రాంభీలు పాల్గొన్నారు.

• రాయపర్తి : మండలంలోని మైలారంలో ఆదివారం అయోధ్య రాముని అక్షితలను జడ్పీటీసీ రంగు కుమార్ ఇంటింటికి తిరిగి వితరణ చేశారు. శ్రీరామ మందిర్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన వితరణ కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఈదులకంటి రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు తాళ్ల సోమిరెడ్డి, తాళ్ల సందీప్ రెడ్డి, ఉల్లెంగుల వెంకన్న, జనగాం కొమురుమల్లు, సంపత్, మల్లయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి కబడ్డీ క్రీడలు ప్రారంభం

చెన్నారావుపేట, జనవరి 14 : మండలంలోని ఉప్పరపల్లిలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండు రోజులపాటు కలామ్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ప్రారంభించారు. కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ బాషామీయా మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజంలో ఉన్నత విలువలతో ఉండాలంటే ఆటలతో పాటు విద్యలోను రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అందె వెంకటేశ్వర్లు, వట్టి శ్రీనువాస రెడ్డి, పరికి మధుకర్, శ్రీపాల్, బొమ్మెర సతీష్, మహేందర్, కుక్కల అజయ్, సమ్మెట నగేష్, పెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.